క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


మల్లికార్జున ఆచారి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యాపార నిర్వహణ (బిజినెస్ మేనేజ్‌మెంట్)లో యడ్డానపూడి మల్లికార్జున ఆచారికి డాక్టరేట్ ప్రకటించింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కాలర్‌గా ఉన్న ఆయన, వ్యాపార నిర్వహణ విభాగంలోని సహా ఆచార్యుడు డా. పి.వి. వరప్రభాకర్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. ''ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోని మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారుల పెట్టుబడి ప్రవర్తన మరియు వైఖరిపై అధ్యయనం'' అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ మేరకు ఆయనకు వైవీయూ డాక్టరేట్ ప్రకటించింది.

సత్య నాగేంద్ర రావుకు..



కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లైడ్ మాథమెటిక్స్ స్కాలర్ ఎస్. సత్యనాగేంద్రరావుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన తన పరిశోధనను ప్రొఫెసర్ జి. కాత్యాయని మార్గదర్శకత్వంలో నిర్వహించారు. సత్యనాగేంద్రరావు ' థియోరెటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మాగ్నెటో హైడ్రోడైనమిక్స్ ఫ్లో ఇన్ సస్పెన్షన్ ఆఫ్ నానో పార్టికల్స్ ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ మేరకు వైవీయూ డాక్టరేట్ ప్రకటించింది.

దుస్తుల పంపిణీ


చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు అందుకున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప పట్టణం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు పాఠశాలలకు చెందిన 458 మంది పిల్లలకు ఉచితంగా దుస్తులను అందచేయగా వాటిని సంస్థ ప్రతినిధి ఎల్ ప్రసాదరెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్షేత్ర పర్యటన

కడప ఎడ్యుకేషన్: కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో అర్థశాస్త్ర, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థుల పాఠ్యాంశంలో భాగంగా అదనపు విజ్ఞానం కోసం బుధవారం క్షేత్ర పర్యటన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్షేత్ర పర్యటనలో విద్యార్థులు మొదట చారిత్రాత్మక ప్రదేశమైన తాళ్లపాకను సందర్శించారు. తర్వాత శ్రీకాళహస్తి దేవాలయాన్ని, ఆ తర్వాత శ్రీ కాళహస్తి సమీపంలో ఉన్న హిందుస్థాన్ కోకా కోలా ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించి శీతల పానీయాల ఉత్పత్తి, వాటి తయారీ గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత వరదయ్య పాలెం సమీపంలో ఉన్న ఏకం ఆధ్యాత్మిక క్షేత్రం సందర్శించారు. ఈ క్షేత్ర పర్యటనలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, డాక్టర్ ఎం. గురు మోహన్ రెడ్డి, డాక్టర్ పి. శచీదేవి, రవిశేఖర్ రెడ్డి, నాగవేణిలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తోందని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో నగర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహిస్తున్నామని, 25వ తేదీ ఆర్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మడగలం ప్రసాద్, వెంకటేశు, విజయ్, ప్రతాప్ రెడ్డి, ముని రెడ్డి, రవి, అజయ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

పోరాటాల ఫలితమే గౌరవ వేతనం విడుదల


మాట్లాడుతున్న మగ్బూల్ బాష

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇమామ్, మౌజన్ లకు గౌరవ వేతనం చెల్లించాలని కోరుతూ చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాష పేర్కొన్నారు. అదేవిధంగా దుల్హన్ పథకం నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమామ్, మౌజన్ లకు దాదాపు 11 నెలల నుండి ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉందని, పలు దఫాలుగా ఆందోళన చేయబట్టే ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలియజేశారు.



పారిశుద్ధ్యమా.. ఎక్కడ..?



కడప నగరంలో మున్సిపల్ అధికారులు స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా చెత్త కనబడకుండా చూస్తామని చెబుతూ నగరంలో చెత్త తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కడప అల్మాస్‌పేట ఏ1 నగర్ వద్ద దుస్థితి చూస్తే చెత్త తొలగించే కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయో అర్థమవుతుంది. రోడ్డుపైనే మురికి కాలువలు పొంగి రోడ్డు జలమయం అయినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలకు బానిసైన వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని ప్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కొంతమంది కార్మికులు, కూలీలు మత్తుకు అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగంటారని.. వారి కలలను కల్లలుగా చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారన్నారు. మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. నాగరాజు, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'బ్రౌన్' గ్రంథాలయానికి పర్యాటక ప్రాధాన్యత


బ్రౌన్ గ్రంథాలయంలో రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

కడప కల్చరల్: కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యతనిస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఆయన కడప పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ గ్రంథాలయం విలువైన పుస్తకాలతోపాటు తాళపత్రాలు, తామ్ర పత్రాలు, పురాతన నాణేలతో ఒక మ్యూజియంలా కనిపిస్తోందని ఆయన అభివర్ణించారు. దీన్ని జిల్లాకు వచ్చే ప్రముఖులందరూ తప్పక సందర్శించేలా దర్శనీయ, పర్యాటకంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ ఆయనకు గ్రంథాలయ ప్రత్యేకతలు వివరించి, దాన్ని పర్యాటక ప్రాంతంగా, దర్శనీయ స్థలంగా ప్రకటించాలని కోరారు. బ్రౌన్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జానమద్ది పీఠం పక్షాన ఆయనను శాలువతో సత్కరించారు. గ్రంథాలయ గౌరవ సభ్యత్వ కార్డును ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, హరిభూషణరావు, రమేష్‌రావు, నీలకంఠ, ఇంజనీరు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప రామరాజుపల్లె బ్రాంచ్‌కు సంబంధించిన యుఫోరియా–2025 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకలకు వైవీయూ గణిత విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కాత్యాయని హాజరయ్యారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీదేవి, బానేష్ సాయిరెడ్డితో కలిసి ముఖ్య అతిథి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల యాజమాన్యం కృషి అభినందనీయం అన్నారు.

–కడప ఎడ్యుకేషన్

ఇంటింటా న్యాయ ప్రచారం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇంటింటా న్యాయ ప్రచారంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7654 గృహాలను సందర్శించి 99 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించామని అధికారుల బృందం తెలియజేసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశానుసారం, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాలలోపుగల పిల్లలకు పుట్టకతోవచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి నివారణకు ఇంటింటి న్యాయ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవిత సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ పండితులు, అర్చకులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి పురస్కరించుకుని బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్ పర్యవేక్షణలో ఆలయ పండితులు, అర్చకులు బుధవారం సాయంత్రం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచాగవ్యారాధన ప్రోక్షణ, యాగశాల ప్రవేశం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అదివాసం, నీరాజనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

కమలాపురం : రైతులందరూ తప్పని సరిగా రైతు గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం చిన్నచెప్పలిలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. రైతులందరూ తమ పట్టాదారు పాసు పుస్తకాలు లేదా 1బి, అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుతో లింక్ అయిన సెల్‌ఫోన్‌తో ఆర్‌ఎస్‌కే లకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కడప అర్బన్: మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉక్కాయపల్లెకు చెందిన హుసేన్‌బాషా (38) అనే వ్యక్తి ఈనెల 5వ తేదీన తన ఇంటి మిద్దెపైకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

వివరాలు.. మహబూబ్‌బాషా కువైట్‌లో రాజంపేట వారికి చెందిన సెల్‌ఫోన్‌ల దుకాణంలో పనిచేసేవాడు. ఆ దుకాణంలో రూ. 8 లక్షలు కనిపించలేదని దుకాణదారులు డబ్బులు చెల్లించాలని అతనిపై ఒత్తిడి తెచ్చారు. డబ్బులు తాను తీసుకోలేదని మహబూబ్ బాషా తెలిపాడు. కడపలో ఉన్న ఇల్లును విక్రయించి అయినా డబ్బులను చెల్లించాలని అతడిపై వారు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అతడు ఈ నెల 5వ తేదీ కంటేముందే ఇక్కడికి తిరిగి వచ్చి.. అప్పటి నుంచి తీవ్ర ఆవేదనలో ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 5 వ తేదీన మిద్దెపైకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 నుంచి షహమీరియ దర్గా ఉరుసు


షహమీరియా దర్గా

కడప కల్చరల్: కడప నగరం రవీంద్ర నగర్‌లోని ఆస్థాన ఏ షహమీరియ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 22 నుంచి నిర్వహించనున్నారు. దర్గాలోని హజరత్ సయ్యద్ షా అబ్దుల్ హక్ ఉరుఫ్ షహమీర్‌బాష సాహెబ్ రహమతుల్లా అలైహి పేరిట ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ హుసేని బాష షామీరి సాహెబ్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 22న అసర్ నమాజ్ తర్వాత ఖత్మే ఖురాన్ మజీద్, మగ్రిబ్ నమాజ్ తర్వాత సలామ్, షీర్జా ఖాని, ఫాతెహా ఖానీ నిర్వహిస్తామన్నారు. 23న అసర్ నమాజ్ తర్వాత తమ ఇంటి నుండి జులూస్, చాందిని తో ఊరేగింపుగా దర్గా షరీఫ్‌కు చేరుకుంటామన్నారు. మగ్రిబ్ నమాజ్ తర్వాత షీర్జా ఖాని, ఫాతెహా ఖాని, నాతియా మెహిఫిల్ (కవి సమ్మేళనం) జరుగుతుందని వివరించారు. నాతియా మెహఫిల్‌లో ప్రముఖ కవులు బనారస్ నుండి హజరత్ అబ్దుల్ కబీర్ సాహెబ్ కబీర్ షామీరి, ఆగ్రా నుండి హజరత్ ముబారక్ అలీ దిల్ కష్, హైదరాబాద్ నుండి హజరత్ సయ్యద్ రిజ్వాన్ ఖాదరి సాహెబ్, కాన్పూర్ నుండి హజరత్ జహీర్ ఖాన్ పూరి, స్థానిక కవులు పాల్గొంటున్నారని తెలిపారు.

సమయపాలన అలవరచుకోవాలి



మాట్లాడుతున్న కడప రామకృష్ణమిషన్ కార్యదర్శి అనుపమానంద స్వామి

కడప ఎడ్యుకేషన్: నేటి యువత సమయపాలన, ఆత్మవిశ్వాసం అలవరచుకొని దేశ భవిష్యత్తుకు బాసటగా నిలవాలని కడప రామకృష్ణమిషన్ కార్యదర్శి అనుపమానంద స్వామి పిలుపునిచ్చారు. కడప రిమ్స్ రోడ్డులో గల స్పిరిట్స్ కళాశాలలో బుధవారం 'యువ జాగృతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానంద జీవితం, సందేశాలను అధ్యయనం చేయడం ద్వారా విచక్షణ జ్ఞానం, సంకల్పశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి పెంపొందడం జరుగుతుందన్నారు. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం, దేశ పురోభివృద్ధి నేటి యువత చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. కళాశాల సంచాలకులు రవీంద్ర మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పిన విధంగా ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అది సాధించే వరకు కృషి చేయాలని కోరారు. అనంతరం అనుపమానంద స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణమిషన్ సమన్వయకర్త చలపతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేయాలి


కడప ఉర్దూ బాలికల హైస్కూల్ హెచ్‌ఎంతో మాట్లాడుతున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలోని ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్‌హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా డిమాండ్ చేశారు. కడపలోని ఉర్దూ పాఠశాలల్లో బుధవారం వారు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలకు సరిపడా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాకపోవడంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయన్నారు. కడప నగర పరిధిలోని గౌస్ నగర్, ఆగాడి, బుచ్చర్ స్ట్రీట్, శంకరాపురం, నబీకోట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలకు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, నూరుల్లా, మహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న కడప ట్రాఫిక్ సీఐ జావేద్

కడప అర్బన్: ప్రాణం ఎంతో విలువైనదని , రోడ్డు ప్రమాదాల వలన ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా ట్రాఫిక్ విధుల్లో ఉండే హోంగార్డ్స్, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ట్రాఫిక్ సీఐ జావేద్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు హోంగార్డ్స్ మొబిలైజేషన్‌లో భాగంగా స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ట్రాఫిక్ సీఐ జావేద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన తరగతులు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన తరగతులు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. రాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, నిర్లక్ష్యంగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనచోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసేవారు, సీటుబెల్ట్ ధరించనివారు, హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి

కడప కార్పొరేషన్: కర్ణాటక రాష్ట్రం యాదగిరి మండలం, గురు మిట్టల్ గ్రామం, ఇంద్రనగర్ కాలనీ నివాసులైన బేడ బుడగ జంగం కులానికి చెందిన మైనర్ బాలికలపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి కోరారు. మైనర్ బాలిక సామమ్మ (15), శమమ్మ(20)లు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుకుంటూ జీవించేవారని, వారిపై ఆరుగురు యువకులు అత్యాచారం చేసి, హత్య చేయడం అమానవీయమన్నారు. వారి మృతదేహాలను కాలువలో పడేసి వెళ్లారన్నారు. ప్రభుత్వం దర్యాప్తు ముమ్మరం చేసి ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని పట్టుకొని కఠిన శిక్ష విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బేడ, బుడగజంగం నాయకులు సి వెంకటేష్, పి ఆంజనేయులు, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన రెడ్డి రోహిత్ కుమార్

కడప ఎడ్యుకేషన్: కడప పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రెడ్డి రోహిత్ కుమార్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. నంది మండలం గ్రామానికి చెందిన రమణమ్మ, నాగేంద్రల కుమారుడు రెడ్డి రోహిత్‌కుమార్ 2024 అక్టోబర్‌లో నంద్యాల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయస్థాయి పోటీలు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 22 నుండి 26 వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు.

22న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరులోని వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీలో బీమా సఖి, బెల్‌స్టర్ మైక్రో ఫైనాన్స్ లి మిటెడ్‌లో ట్రైనీ అసోసియేట్, ఎస్‌బీఐ కార్డ్స్ ఇన్నోవా సోర్స్ కంపెనీలో రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.7 వేల నుంచి రూ.19,500 వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూలకు రావాలన్నారు.

23న పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న శ్రీ శివభక్తేంద్రస్వామి పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. జిల్లాలోని ఖాజీ పేటలోగల శివభక్తేంద్రస్వామి ఆలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సభకు రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ జి.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షులుగా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సాహితీ విమర్శకులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పుస్తక పరిచయం చేయనున్నట్లు తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటాలు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్: కబ్జాదారుల చెర నుండి విముక్తి చేసి పేదలు పోరాడి గుడిసెలు వేసుకుంటే వాటిని కూల్చి తిరిగి కబ్జాదారులకు కట్టబెట్టాలని చూస్తున్న రెవెన్యూ అధికారుల వైఖరి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలం సాగు భూమి సాధన కోసం సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు దక్కేవరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగ సుబ్బారెడ్డి , ఎస్. వెంకట శివ, కేసీ బాదుల్లా, జి. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని భాగ్యనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రస్తుతం మంగళగిరిలో ఎక్సైజ్ సీఐగా విధులను నిర్వహిస్తున్న శ్రీనివాసమూర్తిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలియజేశారు. బాధితుడి వద్ద నుంచి 2016 సంవత్సరంలో తన ఇంటిలోని వారి బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు డబ్బులు కావాలంటూ రూ. 9 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తీసుకున్న సమయంలో కడపలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. తరువాత సీఐగా పదోన్నతి రావడంతో మంగళగిరిలో విధులను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డబ్బులను ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల శ్రేయస్సుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: రైతుల శ్రేయస్సుకు ప్రతి ఇన్పుట్ సబ్సిడీ డీలర్ కృషి చేయాలి ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇన్పుట్ సబ్సిడీ డీలర్లకు దేశీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్పుట్ సబ్సిడీ డీలర్లు ప్రతి ఒక్కరూ కూడా వ్యవసాయ డిప్లొమా కోర్సులను పూర్తి చేయాలన్నారు. అలాంటి వారు మాత్రమే ఇన్పుట్ సబ్సిడీ డీలర్లుగా మందులు, ఎరువులు అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనుమతిచ్చిందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు డాక్టర్ వీరయ్య, డాక్టర్ అంకయ్య కుమార్‌లు, ఆత్మ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.